చేతిలో వున్న అడ్రస్ మరోసారి చూసుకుని తనకు కావలసిన ఇల్లు అదేనని నిర్ధారణ చేసుకున్న సత్యం గేటు తీసుకుని లోపలికి వెళ్ళాడు. కాలింగ్ బెల్ నొక్కాడు. ముందుగదిలో కూర్చుని మేగజైన్ చదువు కుంటూన్న అవంతి విసుగ్గా లేచివెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా ఉన్న మనిషిని చూసి "ఎవరండీ? ఏంకావాలి? ఏమాత్రం సామ్యం, మర్యాద లేకుండా చిరాగ్గా అడిగింది.



# ఎందుకు నాన్నా- ఏడుస్తున్నావ్?

పొత్తూరి విజయలక్ష్మి

"మూర్తి వున్నాడా అమ్మా!" చూడముచ్చటగా వున్న ఆ అమ్మాయిని వాత్సల్యంగా చూస్తూ అడిగాడు సత్యం. ఉన్నారన్నట్లు తలాడించి లోపలికి వెళ్ళిపోయింది. ఆ నిర్లక్ష్యం చూసి సత్యం మనసు చివుక్కుమంది. అయినా చిన్నపిల్ల దాని మొహం, దానికేం తెలుస్తాయి ఈ మర్యాదలన్నీ అనుకున్నాడు.

"ఎవరా వచ్చిందీ?" లోపల్నించి వినిపించిందా ఆడకంఠం.

"ఎవరా! నాన్నకోసం" సమాధానం చెప్పింది అంకిత.

"ఊ! తెల్లవారిందిగా. మొదలు" గట్టిగానే విను క్కుందా కంఠం.

అంత స్పష్టంగా వినపడినా, వినపడనట్టే దృష్టి మరల్చుకుని ఆ ఇంటి అందచందాలని చూస్తూ వుండి

